క్లుప్తంగా

రోడ్డుకు అనుమతులు ఇవ్వండి



డీఎఫ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పెంబి: మండలంలోని పుల్గంపాండ్రి నుంచి ఇచ్చోడ మండలం సిరిచెల్మ వరకు అటవీమార్గంలో రోడ్డు నిర్మించేందుకు అనుమతులు ఇవ్వాలని పెంబి మండంలోని హరిచంద్‌తాండ, పుల్గంపాండ్రి, తాటిగూడ గ్రామస్తులు సోమవారం జిల్లా కేంద్రంలో డీఎఫ్‌వో సునీల్ హిరామత్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన డీఎఫ్‌వో ఈ అంశం మా దృష్టిలో ఉందని.. త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇందులో హరిచంద్‌తాండ సర్పంచ్, టీకాజీ, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు 133 మందికి గాను 8మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు నలుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు.

బస్‌పాసులకు దరఖాస్తు చేసుకోండి

నిర్మల్‌టౌన్: పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు బస్‌పాసులకు దరఖాస్తు చేసుకోవాలని నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న సోమవారం ప్రకటనలో తెలిపారు. 12ఏళ్లలోపు బాలురకు, పదో వరకు చదువుతున్న బాలికలకు ఉచిత బస్‌పాసులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత పాసులు 20 కిలోమీటర్ల వరకు వర్తిస్తాయన్నారు. విద్యార్థులు పాస్ ఫొటో, ప్రిన్సిపాల్ సంతకంతో అప్లికేషన్ ఫారం, బోనఫైడ్ తీసుకొని బస్టాండ్ కౌంటర్‌లో పొందవచ్చని సూచించారు. సందేహాలుంటే నెంబర్ 73828 42582లో సంప్రదించాలని కోరారు.

అన్నపూజ

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి మహాదేవ్ మందిర్‌లో సోమవారం కాలనీవాసులు పలువురు ఘనంగా అన్నపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గల్లి సర్పంచ్ అల్లకొండ సాయినాథ్, ఉపసర్పంచ్ నిమ్మోల్ల గట్టు, కుంట కాశీనాథ్ తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

ముధోల్: మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారుల బండి పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్సు పత్రాలను పరిశీలించారు. మద్యం తాగి నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు జమచేయాలి

ఖానాపూర్: కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించిన రైతులకు ధాన్యం డబ్బులను ప్రభుత్వం వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధా న్యం డబ్బులు రాక సాగు పనులు ప్రారంభించలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం సకాలంలో తూకం వేయకపోవడం, బస్తాలను తరలించకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. తోట సత్యం, అడ్వాల శంకర్, సట్ల రమేశ్ తదితరులు ఉన్నారు.

ఇళ్లు కేటాయించాలి

కడెం: ప్రజా సమస్యలపై పోరాడే జర్నలిస్టులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పా ద్దుటూరి సతీశ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల పంపిణీ చేయకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు.

ఆర్థికసాయం అందజేత



రాధకు సాయం అందిస్తున్న జాన్సన్

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఇళ్లు దెబ్బతిని నష్టపోయిన కుటుంబాలను బీఆర్‌ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్ సోమవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కాలనీకి చెందిన కంచి రాధ, రామక్కల ఇళ్లకు వెళ్లి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అంతకుముందు కాలనీలోని సీతారామాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. పట్టణంలో నూతనంగా ఎన్నికైన ఖానాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని సన్మానించారు. దివాకర్, రమేష్, సంతోశ్, సాబీర్, కరిపె రాజశేఖర్, వంశీ, సాడిగె ప్రసాద్, దయాకర్, లక్ష్మన్, సురేశ్, శేఖర్, గంగాధర్, మజర్, షఫీ, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు అండగా కేసీఆర్

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: దివ్యాంగులకు సీఎం కేసీఆర్ అండగా ఉండి.. వారి అభ్యున్నతికి, సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సాగర్ కన్వెన్షన్‌హాల్‌లో సోమవారం వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల కృతజ్ఞత సభ ఏర్పాటు చేయగా.. మంత్రి హాజరయ్యారు. ఈసందర్భంగా తమకు పింఛన్‌ను రూ.4,116కు పెంచినందుకు గాను సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత పాలకులు వృద్ధులకు రూ.200, దివ్యాంగులకు రూ.500 మాత్రమే పింఛన్లు ఇచ్చేవారన్నారు. కానీ 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.200 పింఛన్‌ను రూ.1,000, దివ్యాంగుల పింఛన్‌ను రూ.500 నుంచి రూ.1,500కు పెంచిందన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,000 పింఛన్‌ను రూ.2,016, దివ్యాంగుల పింఛన్‌ను రూ.1,500 నుంచి రూ.3,016కు పెంచిందని వెల్లడించారు. అదే విధంగా ఆసరా పింఛన్ల పెంపుతోపాటు పింఛన్‌దారుల వయోపరిమితి 57 ఏళ్లకు తగ్గించారని వివరించారు. వచ్చే నెల నుంచే పెంచిన పింఛన్ అమల్లోకి వస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఆసరా పింఛన్లు ఈ స్థాయిలో ఇస్తున్నారా అని ప్రశ్నించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఆర్డీవో స్రవంతి, వయోవృద్ధుల శాఖ అధికారి విజయలక్ష్మి, దివ్యాంగులు పాల్గొన్నారు.

త్వరలో 'డబుల్' ఇళ్ల పంపిణీ

నిర్మల్‌టౌన్: నిర్మల్ నియోజకవర్గంలో త్వరలో దశలవారీగా డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ చేస్తామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని బంగల్‌పేట్, నాగనాయిపేట్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తడంతో సోమవారం మంత్రి పరిశీలించి మాట్లాడారు. పేదలు ఆత్మ గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని అన్నారు. నాగనాయిపేట్‌లో రూ. 54.24 కోట్లతో నిర్మించిన 1014 డబుల్ బెడ్ రూం ఇళ్లు, బంగల్‌పేట్ (ఖురాన్‌పేట్)లో రూ.23.86 కోట్ల తో నిర్మించిన 446 ఇళ్లు (మొత్తం రూ.78 కోట్లతో నిర్మించిన 1460 ఇళ్లు) గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయిందని.. త్వరలో వారికి పట్టాలు అందిస్తామన్నారు. త్వరలో సామూహిక గృహ ప్రవేశాలకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలిపారు. సిద్దాపూర్‌లో 600 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఇతర అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌రూరల్: సమాజంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఉందని.. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి వరల్డ్ స్కూల్‌ను సోమవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా కేంద్రంలో సీబీఎస్‌ఈ సిలబస్ ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నైతిక మానవీయ విలువలు నేర్చుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాధ్యత గల పౌరులుగా ఎదిగి దేశంలోని వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిలో నిలవాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, సారంగాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నిజామాబాద్ కార్మిక శాఖ అధికారి ముత్యంరెడ్డి, పారిశ్రామికవేత్త మురళీధర్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ లింగారెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రెటరీ జగదీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జాన్సన్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాణ్యతలోపంపై విచారణ జరపాలి'

ఖానాపూర్: పట్టణంలో గోదావరి వద్ద నాణ్యత లోపంతో నిర్మించిన వైకుంఠధామం పనులపై వెంటనే విచారణ జరపాలని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోశ్ డిమాండ్ చేశారు. సోమవారం వైకుంఠధామం వద్ద వారు పరిశీలించి మాట్లాడారు. రూ.50లక్షలతో చేపట్టే పనులను నాణ్యత లోపంతో చేపట్టి రూ.60లక్షల వరకు బిల్లులు తీసుకున్నారన్నారు. గతంలో ఖానాపూర్ పంచాయతీగా ఉన్న సమయంలోనే ఇదే శ్మశాన వాటికకు రూ.15లక్షల వరకు వెచ్చించారన్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో పనులు అవినీతిమయంగా చేస్తున్నారని ఆరోపించారు. ఈవిషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్వయాన కాంట్రాక్టర్ అయిన మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. రూ.62లక్షలతో నిర్మించిన వైకుంఠధామం చిన్నపాటి గాలిదుమారానికి కూలడం చూస్తుంటే పనుల్లో నాణ్యత తెలుస్తుందన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి

- ఎమ్మెల్యే రేఖానాయక్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: గ్రామల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. సోమవారం పల్లెపల్లెకు రేఖక్క కార్యక్రమంలో భాగంగా మండలంలోని మారుమూల అల్లంపల్లి పంచాయతీ పరిధిలోని అద్దాల తిమ్మాపూర్, చింతగూడ, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను విన్నవించారు. భగీరథ నీరు రాని గ్రామాల్లో బావుల ద్వారా నీరందించేలా చర్యలు తీసుకోవాలని గుర్రమాదిర వంతెన నిర్మాణం చేపట్టాలని ఫోన్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కోరారు. గ్రామంలో ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధితోపాటు పథకాల అమలుకు కృషి చేస్తున్న పంచాయతీ కార్యదర్శి మనోజ్‌ను శాలువాతో సన్మానించారు. తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, ఆత్మ కమిటీ చైర్మన్ సతీశ్, సర్పంచ్ మాన్కుబాయి, సర్దార్ తదితరులు ఉన్నారు.

2కె రన్ ప్రారంభం

ఖానాపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 2కె రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ప్రారంభించారు. అనంతరం మండలంలోని బీర్నంది గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించే రామాలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఖానాపూర్‌లోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కంచి రాధకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.7900 విలువైన పరిహారం ప్రొసీడింగ్, రామక్కకు రూ.3200తో ప్రతిపాదించిన ప్రొసీడింగ్ కాపీలను ఆయా కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో శ్యాంనాయక్, అంకం రాజేందర్, కలీల్, చిన్నం సత్యం, సాగి సువర్ణ, మోహిద్, వాల్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, భూమేష్, రాజేశ్వర్, నవీన్, సీఐ నారాయణనాయక్, ఎస్సై ఆర్.శంకర్, తహసీల్దార్ రాజమోహన్ తదితరులు ఉన్నారు.

రోజూ రన్నింగ్ చేస్తే ఆరోగ్యం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- ఉత్సాహంగా 2కే రన్



భైంసాలో రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజు రన్నింగ్ చేయాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భైంసా సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 2కె రన్ ఉత్సాహంగా సాగింది. పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, పట్టణ ప్రముఖులు, యువత, యువజన సంఘాల సభ్యులు, తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేక రాష్ట్రంలో పోలీసులకు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.దామోదర్ రెడ్డి, సీఐలు ఎల్.శ్రీను, చంద్రశేఖర్, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు..

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ పునఃనిర్మాణానికి శంకస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కృషితో రూ.27లక్షలు మంజూరయ్యాయన్నారు. హనుమాన్ ఆలయాభివృద్ధికి రూ. 3లక్షలు విరాళంగా అందించిన కంటోన్మెంట్ సూపరింటెండెంట్ మేడారం దేవేందర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్ రావు పటేల్, ఎంపీటీసీ గిరీష్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, ఆత్మ చైర్మన్ సవ్య అశోక్ రెడ్డి, ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి, గజ్జారం, దేవాదాయశాఖ ఏఈ దేవేందర్, రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభమైన పాఠశాలలు



లక్ష్మణచాంద : పొట్టపెల్లిలో విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



దస్తురాబాద్ బుట్టాపూర్ పాఠశాల వద్ద..



కుభీర్‌లో పుస్తకాలు అందిస్తున్న ఎంఈవో చంద్రకాంత్



సోన్ : కడ్తాల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: వేసవి సెలవులు ముగియడంతో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలకు వచ్చారు. ఉపాధ్యాయులు వారికి పూలతో స్వాగతం పలికారు. ఈ విద్యాసంవత్సరం 2023–24 నుంచే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం అమల్లోకి రానుంది.

దస్తురాబాద్: మండలంలోని మున్యాల, బుట్టాపూర్, గొడిసీర్యాల పాఠశాలలకు విద్యార్థులు హాజరయ్యారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మాత్రం హాజరు కాలేదు.

భైంసారూరల్: మండలంలో మిర్జాపూర్, చింతల్‌బోరి, మహాగాం, మాటేగాం, వానల్‌పాడ్, కోతల్‌గాం, ఇలేగాం, దేగాం గ్రామాల్లో మొదటిరోజు విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదైంది.

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొలిరోజే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పాఠశాల ఆవరణలో ఏర్పడిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించేందుకు పలుచోట్ల ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేశారు. అనేక చోట్ల అటెండర్లు రాకపోవడంతో చోట్ల ఉపాధ్యాయులే గదులను శుభ్రం చేసుకున్నారు. పాఠశాలలకు వచ్చిన వారికి కరపత్రాలను పంపిణీ చేశారు.

కుభీర్: మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో చంద్రకాంత్.. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంకు సంబంధించిన బట్ట అందజేశారు. పీఆర్టీయూ మండల కార్యదర్శి రాఘవేంద్ర, బి.సాయినాథ్, సీఆర్పీ ఆనంద్, బెల్గాం ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ ఉన్నారు.

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు మెడిటేషన్ చేయించారు.

శిశుమందిర్‌లో గాయత్రీ హోమం

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మ ందిర్‌లో గాయత్రీ హోమం చేయించారు. అనంతరం విద్యార్థులను బస్సుల్లో జటాశంకర ఆలయం, పల్లె ప్రగతి వనానికి తీసుకెళ్లారు. సమితి కార్యదర్శి సుదర్శన్, పాఠశాల కార్యదర్శి మానాజీ, ప్రధానాచార్యులు సారథి రాజు, స్వప్న, శర్మ, ఆచార్యులు పాల్గొన్నారు.

నిర్మల్‌ఖిల్లాగేట్: పాఠశాల పునఃప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సరస్వతి యజ్ఞం నిర్వహించారు. ఆర్యవైదిక్ పురోహితుడు శ్రీకాంత్ మాట్లాడుతూ సరస్వతి యజ్ఞం నిర్వహించడం ద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూన ప్రవీణ్, ముప్పిడి రవీందర్, కట్ట నాగచారి, లింగంపల్లి కిషన్, సోలాపూర్ రాజేశ్వర్, వేణుమాధవ్, కొండూరి రమేశ్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సర్వే

తానూరు: మండలంలోని బెంబర, బోరిగాం, ఉమ్రి(కే), ఝరి(బి)తండా, బోల్సా, తానూరు గ్రామాల్లో ఇళ్ల కోసం 1300 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. తానూరులో సోమవారం ఆర్ఐ గంగాధర్ దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. అధికారులు, తదితరులు ఉన్నారు.

ప్రజాఫిర్యాదుల విభాగానికి రెండు దరఖాస్తులు

తానూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చూస్తామన్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మండలాభివృద్ధి

- కుంటాల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గజ్జారాంయాదవ్



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జారాం యాదవ్

కుంటాల: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్ పేర్కొన్నారు. సోమవారం కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి విన్పించారు.

- ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పల్లెల్లో పకడ్బందీగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.
- గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని.. గర్భిణులు సాధారణ ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని హెల్త్ అసిస్టెంట్ ఎన్‌వీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు.
- ఏవో సోమలింగారెడ్డి మాట్లాడుతూ రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశామన్నారు. త్వరలో రైతుబంధు సాయం ఖాతాల్లో జమ చేయడంతోపాటు జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.
- మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద లక్ష 34వేల పని దినాలను కూలీలకు కల్పించామని ఏపీవో గట్టుపల్లి నవీన్ పేర్కొన్నారు.
- స్త్రీనిధి ద్వారా రూ.5.90 కోట్ల రుణాలను సభ్యులకు పంపిణీ చేస్తామని ఏపీఎం భోజన్న వెల్లడించారు. మహిళా రైతులను ప్రోత్సహించేందుకు వెయ్యి గేదెలను అందిస్తామన్నారు.
- ఈనెల 18న మంచినీళ్ల పండగను నిర్వహించనున్నట్లు వాటర్‌గ్రిడ్ ఏఈ గణేశ్ తెలిపారు.
- వర్షాకాలం దృష్ట్యా ఓహెచ్‌ఎస్ ఆర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు.
- పశువైద్యాధికారి ప్రకాశ్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 150 మంది గొర్రెల యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.
- పీఆర్ ఏఈ రఘు మాట్లాడుతూ మండలంలో రూ.3కోట్ల 7లక్షల నిధులతో సీసీ రోడ్ల పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రతి పంచాయతీలో 5వేల మొక్కలు నాటించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఎఫ్ఎస్‌వో రేష్మ తెలిపారు.
- ఆరోగ్య పరిరక్షణకు గ్రామాల్లో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి విశారద పేర్కొన్నారు.
- పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించామని.. బడిబాటలో భాగంగా బడీడు పిల్లలను బడిలో చేర్పిస్తున్నామని ఎంఈవో ముత్యం తెలిపారు.
- మహారాష్ట్రలోని అప్పరావుపేట్ నుంచి దొనెల్లి, కుంటాల, కల్లూర్, లోకేశ్వరం, నందిపేట్ మీదుగా నిజామాబాద్‌కు బస్సు నడిపించాలని కోఆప్షన్ సభ్యులు గౌస్ కోరారు. భైంసా నుంచి కల్లూర్, అందకూర్, కుంటాల మీదుగా గొల్లమాడకు నైట్ హాల్ట్ బస్ నడిపించాలని అంబకంటి ఎంపీటీసీ సుధాకర్ కోరగా ఆర్టీసీ అధికారి సాంబయ్య సానుకూలంగా స్పందించారు. గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన డబ్బులు అందలేదని ఓల సర్పంచ్ కనీష్‌ఫాతిమా పేర్కొనగా.. అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, వైస్ ఎంపీపీ మానిక నవీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దశాబ్ది కాలంలో సాధించింది గోరంత

- సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లాగేట్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి దశాబ్దమైనా సాధించిన ప్రగతి గోరంత అయితే కేసీఆర్ ప్రభుత్వం కొండంత సాధించినట్లు చూపిస్తుందని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య విమర్శించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా ఆకాంక్ష దీక్ష దివస్ పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్‌వో లోకేష్‌కు మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను, ప్రజలకు ఇచ్చిన హామీలను కేసీఆర్ విస్మరించారని ఆరోపించారు. హామీలు అమలు చేసేవరకూ పోరాడుతామన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్‌చేసి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగులందరికీ రూ.10 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. ధరణి లోపాలను సవరించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు ఆర్.రామ్‌లక్ష్మణ్, ఏం బక్కన్న, గంగన్న, ఎం.అంకూస్, ఎస్‌కే.మహమూద్ , జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేందర్, పీవోడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, జిల్లా నాయకులు జక్కుల రాజన్న, డి.సుదర్శన్, గొరెబాయి, వినోద్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

'గౌడ కులస్తులకూ సాయం అందించాలి'

కడెం: బీసీ కుల వృత్తిదారులకు అందించే రూ.లక్ష సాయాన్ని తమకు కూడా అందించాలని గౌడ కులస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సునారికారి రాజేశ్, గౌడ కులస్తులు శేఖర్‌గౌడ్, దశిగౌడ్, రాజాగౌడ్, రాజేశ్వర్, సతీశ్, వెంకటేశ్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: బీసీ కుల వృత్తిదారులకు అందించే రూ.లక్ష ఆర్థిక సాయాన్ని గౌడ కులస్తులకు సైతం వర్తింపజేయాలని కోరుతూ మండలంలోని గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నాగరాజుగౌడ్, తిరుపతి గౌడ్, ప్రభాకర్ గౌడ్, గంగాధర్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రాజాగౌడ్, దశిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.